
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

గురువారం 17 అక్టోబరు 2024

ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి
- జనగామ విద్యార్థులకు శుభవార్త
- ఐదు సంవత్సరాల కృషికి ఫలితం
- కొత్త కోర్సులు, హాస్టళ్ల నిర్వహణకు అవకాశం

8



ఏబీవీ కళాశాల

పేదల బతుకుల్లో వెలుగులేవీ?



నేడు అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం

- రోజులు మారుతున్నా వీడని పేదరికం
- ఇప్పటికీ కూడు, గూడు కోసం లక్షలాది కుటుంబాల తండ్లాట
- పెరగని తలసరి ఆదాయం.. ఫలితమివ్వని పథకాలు
- పేదరిక నిర్మూలనకు పలు కార్యక్రమాల అమలు
- మహిళల భాగస్వామ్యంతో స్వయం సహాయక సంఘాలు



ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేదరికం.. | గ్రామాల్లో 37.6 శాతం | పట్టణ ప్రాంతాల్లో 25.4 శాతం

ఇటీవలి రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం

జిల్లా	తలసరి ఆదాయం	స్థానం
జయశంకర్ భూపాలపల్లి	రూ. 2,71,555	5
వరంగల్	రూ. 2,22,628	15
జనగామ	రూ. 2,17,277	19
మహబూబాబాద్	రూ. 1,99,588	22
ములుగు	రూ. 197,539	25
హనుమకొండ	రూ. 1,86,784	30

రోజులు గడిచిపోతున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. సాంకేతికంగానూ ఎన్నో విప్లవాత్మక మార్పులు.. ఆర్థిక సంస్కరణలు వస్తున్నాయి. కానీ పేదల బతుకుల్లో మాత్రం వెలుగులు నిండటం లేదు. పేదరిక నిర్మూల కోసం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు అంతగా ఫలితమివ్వక.. తలసరి ఆదాయం పెరగక.. ఆర్థికంగా అట్టడుగున ఉండే కుటుంబాలు అక్కడే ఉండిపోతున్నాయి. ఇప్పటికీ కూడు, గూడు కోసం నిరంతరం శ్రమిస్తున్న లక్షలాది కుటుంబాలే ఇందుకు నిదర్శనం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సామాజిక ఆర్థిక సర్వే ఫలితాలు కూడా ఇదేచెప్పాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2011 నాటి సర్వే నాటికి.. నేటికీ పరిస్థితుల్లో అంతగా మార్పులేమీ లేవన్నది స్పష్టమైంది. గ్రామీణ ప్రాంతాల్లో 37.6 శాతం, పట్టణ ప్రాంతాల్లో 25.4శాతం మంది పరిస్థితి 'పైన పటారం.. లోన లొటారం' అన్న చందంగా ఉందని వెల్లడైంది. గత దశాబ్దకాలంలో పట్టణాల్లో పెరిగిన మురికివాడల సంఖ్యే ఇందుకు ఉదాహరణగా కనిపిస్తోంది. అయితే 2011-12 జనగణన నాటి పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం పేదరికం స్థాయిలు కాస్త తగ్గినట్టు స్పష్టమవుతోంది.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

7

ధాన్యం కొనుగోలుకు రూ.25వేల కోట్లు సిద్ధం

- 48 గంటల్లో చెల్లింపులు చేసేందుకు ఏర్పాట్లు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు చెందిన ధాన్యం కొనుగోళ్ల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.25వేల కోట్లు సిద్ధం చేసిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం లింగాలఘణపురం మండలం వనపర్తిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి మద్దతు ధరను చెల్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ గ్రామంలో రెండు కొనుగోలు కేం ద్రాలను సన్నాలకు, సాధారణ రకం ధాన్యాలకు వేర్వేరుగా ఏర్పాటు చేసింద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. ఇందుకోసం ఏ-గ్రేడ్ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర చెల్లిం చనుండగా సన్నాలకు మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తుం దన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సన్నాలకు బోనస్ డబ్బులు చెల్లించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా చెల్లింపుల్లో జాప్యం ఉం డబోదని కొనుగోలు కేంద్రంలో విక్రయించిన 48 గంటల్లోగా డబ్బులు రైతు ఖాతాల్లో పడేవిధంగా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింద న్నారు. గతంలో రైతులు ధాన్యం విక్రయించిన 15 రోజుల వరకు కూడా డబ్బులు ఖాతాల్లో జమకాకపోవడంతో విసిగిపోయిన రైతులు వ్యాపారు లకు తక్కువ ధరలకే అమ్ముకునే దుస్థితి ఉండేదన్నారు. రాష్ట్రంలో తెల్లరేష న్ కార్డుదారులందరితో పాటుగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు సన్నబియ్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నా రు. ఈ లెక్కన ఒక రైతు తన ఎకరం విస్తీర్ణంలో సుమారుగా 20 క్వింటాళ్ల సన్నాలు పండిస్తే సగటున రూ.10వేలు అదనంగా ప్రయోజనం చేకూరు తుందన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన రూ.25వేల కోట్లు బ్యాంకర్ల వద్ద అప్పు రూపేణా తీసుకున్న డబ్బును సివిల్ సప్లై అధికారులు ధాన్యం అమ్మిన తర్వాత చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సరస్వతి, డీఆర్‌డీవో వసంత, జిల్లా వ్యవసాయశాఖాధికారి రామా రావు నాయక్, ఏసీపీ భీంశర్మ, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జలంధర్ రెడ్డి, డీఆర్‌డీవో ఏపీడీ శ్రీనివాస్, ఏపీఎం శంకరయ్య, ఆర్‌ఐ కిశోర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు, జనగామ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్, డైరెక్టర్లు నీలం మోహన్, శ్రీలతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం

జనగామ మైనింగ్ ఏడీ సస్పెన్షన్
- రూ.5.12 కోట్ల సీనరేజీ చార్జీల రద్దు
- మహబూబ్‌నగర్‌లో పనిచేసిన సమయంలో ప్రైవేటు సంస్థకు లబ్ధి
- విచారణ పూర్తిచేసి చర్యలు తీసుకున్న అధికారులు
- ఇన్‌చార్జ్ ఏడీగా రాఘవరెడ్డి నియామకం

6



సస్పెన్షన్‌కు గురైన ఏడీ విజయ్‌కుమార్

కొండాపై అసంతృప్తి
- టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు
- తమ నియోజకవర్గాల్లో మంత్రి సురేఖ జోక్యంపై ఫిర్యాదు
- పరకాల, వరంగల్ తూర్పులో విభేదాలపై వివరణ
- పార్టీ అంతర్గత విషయాలపై రచ్చకెక్కవద్దని నేతలకు టీపీసీసీ హితవు

6

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ

చిలుపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నపెండ్యాలలో పోలీసు బలగాలతో కలిసి కార్డన్ సర్చ్ నిర్వహించారు. రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయడంతో పాటు, అనుమానిత వ్యక్తులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు బెల్టుషాపులతో పాటు ఓ కిరాణా దుకాణంపై దాడులు చేపట్టి రూ.4,700 విలువ గల గుట్కాలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ భీంశర్మ మాట్లాడుతూ యువత మద్యపానం, గంజాయి, గుడుంబా, పేకాట, బెట్టింగ్స్ తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు షీటీమ్స్‌తో పాటు డయల్ 100పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జనగామ రూరల్ (రఘునాథపల్లి) సీఐ ఎడవల్లి శ్రీనివాసరెడ్డి, ఎస్సైలు సిరిపురం నవీన్‌కుమార్, వినయ్‌కుమార్, నరేష్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే క్రీడాజ్యోతి ర్యాలీ

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

జనగామ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపేందుకు క్రీడాజ్యోతితో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం సీఎం కప్ ర్యాలీ జనగామ మండలంలోని యశ్వంతాపురం ఎల్లమ్మ గుడి నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు సాగింది. క్రీడాజ్యోతి ర్యాలీని కలెక్టర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువగా క్రీడాకారులు సీఎం కప్‌లో పాల్గొనేలా చేయడమే ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. జనగామ జిల్లాలో ఎంతో మంది క్రీడాకారులున్నారని, ఈ పోటీలలో జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడలలో జనగామ జిల్లా క్రీడాకారులు విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్‌డీవో కొమురయ్య, ఏసీపీ పార్థసారథి, జిల్లా యువజన క్రీడా అధికారి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లేవీ?

- జిల్లాలో కనిపించని సీసీఐ కేంద్రాలు
- ప్రైవేటుకు అమ్ముకుంటున్న రైతులు
- క్వింటాకు రూ.1000 వరకు నష్టపోతున్న అన్నదాతలు
- రైతుల అవసరాన్ని ఆసరాగా మార్చుకుంటున్న పత్తి మిల్లులు

జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాల జాడ కనిపించడం లేదు. పత్తి సీజన్ ప్రారంభమైనప్పటికీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో సీసీఐ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లుతోంది. ప్రతి ఏటా పత్తి దిగుబడి ప్రారంభమయ్యే నాటికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సిద్ధంగా ఉంచాల్సిన బాధ్యత కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అధికారులపై ఉంటుంది. కానీ.. ఈ ఏడాది ఇంకా కేంద్రాలను తెరవలేదు. దీంతో రైతులు పత్తి మిల్లుల యజమానులకు తక్కువ ధరకు పత్తిని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జనగామ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు లేకపోవడం పత్తి మిల్లుల యజమానులకు వరంగా మారింది. రైతుల అవసరాన్ని అవకాశంగా మలుచుకుంటూ రైతులకు కుచ్చుటోపి పెడుతున్నారు. తేమ శాతం, నల్లబారిపోవడం వంటి కారణాలుగా చూపుతూ రైతుకు పత్తి మిల్లుల యజమానులు నష్టాన్ని కలిగిస్తున్నారు. ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాల వల్ల పత్తి పంట దెబ్బతినడంతో పాటు చీడపీడలు ఆశించాయి. దీంతో దిగుబడిపై కొంత ప్రభా వం పడింది. కొన్నిచోట్ల పత్తి కాయలు రాలిపోగా పత్తి నల్లగా మారింది. దీన్ని ఆసరాగా చేసుకున్న మిల్లుల యజమానులు మంచి పత్తికి సైతం అవే సాకులను చూపుతున్నట్లు రైతులు చెబుతున్నారు.





ఓ మిల్లులో కొనుగోలు చేసిన పత్తి, ధర తక్కువగా చెప్పడంతో పత్తిని తిరిగి ఇంటికి తీసుకెళ్తున్న రైతు

క్వింటాకు రూ.1000 వరకు నష్టం

రైతులు పత్తిని మిల్లుల వద్ద అమ్ముకుంటుండగా పెద్ద మొత్తంలో నష్టపోతున్నారు. మిల్లుల యజమానులు పలు సాకులు చెబుతూ క్వింటాకు ఏకంగా రూ.500 నుంచి రూ.1000 వరకు తక్కువగా కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి గాను కనీస మద్దతు ధరలను ఇటీవల సవరించింది. ఇందులో

మిగతా 8వ పేజీలో...

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రాము



పల్లగుట్ట పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో రాము

చిలుపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. బుధవారం మండలంలోని పల్లగుట్ట ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించిన రిజిష్టర్లతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా డీఈవో రాము మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించి విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా బోధన చేపట్టాలని సూచించారు. అనంతరం చిలుపూర్ మండల కేంద్రంలో ఉన్న ఎమ్మార్సీ భవనాన్ని సందర్శించారు. ఎంఎన్‌వో గోవర్ధన్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేతిరి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

చేపపిల్లల సంఖ్యను పెంచాలి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బొమ్మకూరు, గండిరామవరం రిజర్వాయర్లలో చేప పిల్లల విడుదల

నర్మెట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చేపపిల్లల పంపిణీ సంఖ్యను పెంచి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బొమ్మకూరు, మల్లన్నగండి(గండిరామవరం) రిజర్వాయర్‌లలో చేప పిల్లలను విడుదల చేశారు. బొమ్మకూరు రిజర్వాయర్‌లో 1.25 లక్షలు, మల్లన్నగండి రిజర్వాయర్‌లో 2.50 లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ చేపట్టిందన్నారు. జనగామ నియోజకవర్గంలో గత సంవత్సరం 60 లక్షల చేపపిల్లలను పంపిణీ చేస్తే, ప్రస్తుతం 29.50 లక్షలు మాత్రమే ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. యాభై శాతం చేప పిల్లలను ప్రభుత్వం తగ్గించిందన్నారు. ప్రభుత్వం గత సంవత్సరం మాదిరిగానే 60 లక్షల చేప పిల్లలను పంపిణీ చేయాలని కోరారు. అదే విధంగా చేపపిల్లలు పంపిణీ చేసిన కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి రాణాప్రతాప్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగరావు, టీఆర్‌ఎస్వీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కందుకూరి ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ మాలోతు శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షుడు నీరటి సుధాకర్, ఇట్టబోయిన రమేష్, ఓడపల్లి రాజు, బబ్లు, హెబ్బెజర్, జయరాం తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నగండి రిజర్వాయర్‌లో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే పల్లా

బీటీ రోడ్లకు నిధులు

13.20 కి.మీ మేర నిర్మాణానికి రూ.15.41కోట్లు

జనగామ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గంలోని పలు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. నియోజకవర్గంలోని బచ్చన్నపేట, జనగామ, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలాల్లో పలు గ్రామాలను కలుపుతూ బీటీ రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. ఈ విషయంపై డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి నిధుల మంజూరుకు విన్నవించారు. ఈ మేరకు నియోజకవర్గంలో 13.20 కి.మీ మేర రోడ్ల నిర్మాణానికి రూ.15.41 కోట్లు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బచ్చన్నపేట మండలంలోని బండనాగారం-కట్కూరు గ్రామాల మధ్య 5 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.5.8 కోట్లు, జనగామ మండలంలోని సుందరయ్యనగర్ నుంచి పీడబ్ల్యూడీ రోడ్డు వరకు 3 కి.మీ మేర నిర్మాణానికి రూ.3.74 కోట్లు, అదే విధంగా సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని లద్నూరు నుంచి వంగపల్లి వరకు 5.20 కి.మీ మేర నిర్మాణానికి రూ.5.86 కోట్లు మంజూరు అయ్యాయి.

నిధుల మంజూరుపై 'కొమ్మూరి' హర్షం

నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పార్టీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అడగగానే నిధులు ఇచ్చినందున రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రానున్న కాలంలో మరిన్ని నిధులు తీసుకువస్తానని తెలిపారు.



లక్నవరం ఎకోపార్కు ఎదుట ట్రెయినీ ఎఫ్‌బీవోలు

లక్నవరాన్ని సందర్శించిన ట్రెయినీ ఎఫ్‌బీవోలు

గోవిందరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్నవరం సరస్సును దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ నుంచి 35 మంది ట్రెయినీ ఫారెస్టు బీట్ ఆఫీసర్లు (ఎఫ్‌బీవో) బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా వారు సరస్సు పరిసరాల్లో ఎనిమిది కిలోమీటర్ల ట్రెక్కింగ్, క్యాంపింగ్‌సైట్, స్లూస్ పాయింట్‌ను పరిశీలించారు. అదేవిధంగా ఎకో పార్కులో ఉన్న వివిధరకాల చెట్లు, తెల్లపునికి, సీటికానుగ వంటి వాటిపై పస్రా ఎఫ్‌ఆర్‌వో మాధవిశీతల్ వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అకాడమీ ఎఫ్‌బీవో ట్రెయినీ కోఆర్డినేటర్ ఎం.వంశీకృష్ణ, పస్రా అటవీశాఖ అధికారులు వేణుగోపాల్‌రెడ్డి, టి.దీప్‌లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లికుదురుకు చేరుకున్న సీఎం కప్ కాగడ ర్యాలీ



సీఎం కప్ కాగడ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు విద్యార్థులు

నెల్లికుదురు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ 2024 కాగడ ర్యాలీ మహబూబాబాద్ నుంచి నెల్లికుదురుకు బుధవారం చేరుకుంది. పాఠశాల విద్యార్థులు అధికారులు, రాజకీయనాయకులు, క్రీడాకారులు ర్యాలీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువకులు జాతీయ స్థాయిక్రీడలలో రాణించడానికి సీఎం కప్ ఉపయోగ పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంత యువకులలో దాగిఉన్న క్రీడనైపణ్యాలను వెలికి తీయడానికి సీఎం కప్ దోహదపడుతుందన్నారు. త్వరలో నిర్వహించే సీఎం కప్‌కు క్రీడకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ రమేష్‌బాబు, ఎంఈవో రాందాస్, పెటాటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెడుపల్లి ఐలయ్య, జిల్లా అధ్యక్షుడు కొమ్ము రాజేందర్, ప్రధాన కార్యదర్శి విజయ్‌చందర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సత్యనారాయణ, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో చిన్నారి మృతి

జమ్మికుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి గుండె పోటుతో మృతి చెందింది. ఈ సంఘటన మంగళ వారం ఉదయం చోటు చేసుకోగా బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. జయశం కర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పంగిడిపల్లి గ్రామానికి చెందిన మేడిపల్లి రాజు - జెమున దంపతులకు శ్రీయాన్షి (04) ఉన్నారు. జమ్మికుం టలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ భార్యాపిల్లలతో ఇక్కడే నివాసం ఉంటున్నారు.



శ్రీయాన్షి (ఫైల్)

పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో చిన్నారి ఎల్‌కేజీ చదువుతోంది. ఎప్పటిలాగే మంగళ వారం ఉదయం నిద్రలేచిన తర్వాత పాఠశాలకు వెళ్లేందుకు రెడీ అవుతోంది. అప్పటి వరకు ఎంతో చలాకీగా ఉన్న చిన్నారి ఒక్కసారిగా కింద పడిపోయింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు హుటాహుటిన హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు చిన్నారి ఊపిరితిత్తులో ఒక లేయర్ ఏర్పడిందని, దాని వల్ల శ్వాస సరిగా ఆడక గుండెపోటు వచ్చి మృతి చెందిందని నిర్ధారించారు. అప్పటి వరకు కళ్ల ముందు కదలాడిన తమ కుమార్తె ఇక తిరిగి రాని లోకాలకు వెళ్లిందంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు అక్కడున్న వారందరినీ కలిచివేసింది.

ఇఫ్టూ విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ

ఇనుగుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 20న ఇఫ్టూను టీయూసీఐలో విలీన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఇనుగుర్తి జీపీ ఆవరణలో బుధవారం ఇఫ్టూ జిల్లా నాయకుడు కందాల రంగయ్య ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాములు, యాకలక్ష్మి, ఉమ, ప్రసాద్, ఎల్లయ్య, శ్రీను, పార్వతమ్మ పాల్గొన్నారు.

పట్టు వదలకుండా కేంద్రంతో పోరాడతాం

- మహాజాతరకు జాతీయ హోదా తెస్తాం
- మంత్రి సీతక్కతో కలిసి మేడారం శాశ్వత అభివృద్ధికి కృషి
- దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ
- కుటుంబ సమేతంగా వనదేవతల దర్శనం

మేడారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టు వదలకుండా కేంద్రంతో పోరాడి అతిపెద్ద గిరిజన కుంభమేళ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు జాతీయహోదా సాధించి తీరుతామని దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం ఆమె తన భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, కూతురు సుస్మిత పటేల్, అల్లుడు అభిలాష్‌తో కలిసి ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలోని వనదేవతల గద్దెలను దర్శించుకున్నారు. మనవడు శ్రీయాన్ష్ మురళీకృష్ణ పుట్టువెంట్రుకల మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ సునీత, మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు కాక సారయ్య, కొక్కెర కృష్ణయ్య ఘన స్వాగతం పలికారు. గద్దెల వద్దకు చేరుకున్న మంత్రి, కుటుంబ సభ్యులు వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో అధికారులు, పూజారులు మంత్రి సురేఖకు అమ్మవార్ల పట్టు వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

అనంతరం గద్దెల ప్రాంగణం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం ప్రగతిబాటలో నడుస్తోందని, రాష్ట్రం ఆర్థిక కష్టాలను గట్టెక్కాలని అమ్మవార్లను ప్రార్థించామన్నారు. రాష్ట్ర ప్రదాత సోనియా గాంధీతోపాటు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆశయాల సాధనకు శక్తిసామర్థ్యాలను ప్రసాదించాలని కోరుకున్నానన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత తొలి మహాజాతరను వైభవంగా జరిపించామన్నారు. మంత్రి సీతక్కతో కలిసి మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమం లో పోలీసు, దేవాదాయ, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.



కొండా దంపతులకు ప్రసాదాలు అందిస్తున్న పూజారులు



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తుల సందడి

మేడారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క- సారలమ్మలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అమ్మవార్ల గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, చీరె సారెలు సమర్పించారు. కోరికలు తీరాలని మొక్కులు, ముడుపులు ముట్టజెప్పారు. సుమారు ఐదు వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

జనగామ మైనింగ్ ఏడీ సస్పెన్షన్

- రూ.5.12 కోట్ల సీనరేజీ ఛార్జీల రద్దు
- మహబూబ్‌నగర్‌లో పనిచేసిన సమయంలో ప్రైవేటు సంస్థకు లబ్ధి
- విచారణ చేసి చర్యలు తీసుకున్న అధికారులు

జనగామ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు సంస్థకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించిన జనగామ జిల్లా గనులు, భూగర్భశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. గతంలో ఆయన మహబూబ్‌నగర్ జిల్లా ఏడీగా పనిచేసిన సమయంలో వారాహి అనే సంస్థకు అనుకూలంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వానికి రావాల్సిన రూ.5.12 కోట్ల సీనరేజీ ఛార్జీలను రద్దు చేశారన్న ఆరోపణలపై ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. వివరాల్లోకెళితే... మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని 118/పి సర్వేనంబర్‌లో వారాహి సంస్థ వెంచర్‌ను అభివృద్ధి చేసింది. ఈ క్రమంలో సంస్థకు చెందిన వ్యక్తులు పెద్ద మొత్తంలో బయటి నుంచి మట్టిని తీసుకువచ్చి ఆ స్థలంలో ఉన్న కాలువను పూడ్చివేసి కాలువ దిశను మళ్లించారు. దీనిపై ఈ ఫిబ్రవరి నెలలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. మీడియాను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి జరిగిన వ్యవహారాన్ని బయట పెట్టారు. దీంతో అప్పట్లో మీడియాలో కథనాలు సైతం వచ్చాయి.

స్పందించిన అప్పటి మహబూబ్‌నగర్ ఏడీ విజయ్‌కుమార్ అక్రమంగా మట్టి తరలించారన్న కారణంతో రూ.5.12 కోట్ల సీనరేజీ ఛార్జీలు చెల్లించాలని వారాహి సంస్థకు నోటీసులను జారీ చేశారు. కాగా.. విజయ్‌కుమార్ మహబూబ్‌నగర్ నుంచి జనగామకు బదిలీ కాగా దానికి ఒక్క రోజు ముందే గతంలో తాను ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేశారు. వారాహి సంస్థ రూ.5.12 కోట్ల సీనరేజీ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదంటూ గతంలో తాను ఇచ్చిన ఉత్తర్వులనే రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మట్టిని బయట నుంచి అక్రమంగా తరలించలేదని, అక్కడ ఉన్న మట్టినే తవ్వి పోశారని రద్దు ఉత్తర్వుల్లో విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కాగా.. దీనిపై సమగ్ర విచారణ జరపాలంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మహబూబ్‌నగర్ ఆర్డీవో నవీన్, ఇరిగేషన్ ఈఈ ఉదయ్‌శంకర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కృష్ణారావు, మైనింగ్ డీడీ నర్సింహారెడ్డితో కూడిన ఫోర్‌మెన్ కమిటీని కలెక్టర్ నియమించారు. విచారణ చేసిన ఫోర్‌మెన్ కమిటీ మట్టి తరలింపులో అక్రమాలు జరిగాయని నిర్ధారించారు. అక్కడ ఉన్న మట్టి, బయట నుంచి తెచ్చి పోసిన మట్టి రంగు వేర్వేరుగా ఉండడాన్ని అధికారులు గుర్తించారు. దీనిపై ఫోర్‌మెన్ కమిటీతో పాటు మహబూబ్‌నగర్ కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ నివేదిక ఆధారంగా ఏడీ విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ గనుల శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జనగామ ఇన్‌చార్జ్ ఏడీగా రాఘవరెడ్డి

జనగామ గనుల శాఖ ఇన్‌చార్జ్ ఏడీగా యాదాద్రి భువనగిరి జిల్లా ఏడీ రాఘవరెడ్డికి ప్రభుత్వం బాధ్యతలను అప్పగించింది. జనగామ మైనింగ్ ఏడీగా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో రాఘవరెడ్డికి బాధ్యతలను ఇస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు జనగామ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించాలని గనుల శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్ ఆదేశించారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు

నర్సింహులపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తున్న ఓ ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు నమోదైన ఘటన నర్సింహులపేట మండలంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. నర్సింహులపేట మండలంలోని జయపురం గ్రామానికి చెందిన ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు నిబంధనలకు విరుద్ధంగా ప్రాక్టీస్ చేస్తూ మందులు విక్రయిస్తున్నాడనే పక్కా సమాచారంతో వైద్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా డ్రగ్ ఇనిస్పెక్టర్ ఉమారాణి సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయం ఉదయం నుంచి సాయం త్రం వరకు ఆర్‌ఎంపీ వైద్యుని ఇంట్లో సోదారులు నిర్వహించినట్లు సమాచారం. భారీ మొత్తం లో మందులు సీజ్‌చేసి, ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉమారాణిని చరవాణిలో వివరణ కోరేందుకు ప్రయత్రించగా.. అందుబాటులో లేరు. కాగా, జయపురంలో ఆర్‌ఎంపీ వైద్యుని ఇంట్లో జిల్లా డ్రగ్ ఇనిస్పెక్టర్ సోదాలు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న మండలంలోని పలు గ్రామాల ఆర్‌ఎంపీ వైద్యులు సెటర్లు క్లోజ్‌చేసి పరారవ్వడం విశేషం.

తేనెటీగల దాడి

ఒకరికి గాయాలు

కేసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజిలో బుధవారం వల్లందాసు ఎల్లయ్య తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం చేను వద్దకు వెళుతుండగా మార్గమధ్యలో ఒక్కసారిగా తేనెటీగలు ఆయనపై దాడి చేశాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయన్ను తొలుత మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ వేణు, సిబ్బంది

రూ.3.10 లక్షల నగదు అపహరణ

పట్టపగలే బైక్‌లో నుంచి డబ్బులు ఎత్తుకెళ్లిన దొంగలు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కనురెప్పపాటులో బైక్‌లో నుంచి గుర్తుతెలియని దొంగలు రూ.3.10లక్షల నగదు ఎత్తుకెళ్లిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన ప్రకారం... జిల్లాలోని జఫర్‌గడ్ మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన మంద రాజు అనే రైతు ఇటీవల ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడంతో కొత్తగా క్రాప్ లోను తీసుకోవడానికి శివునిపల్లి బరోడా బ్యాంకు వచ్చాడు. రూ.1.10లక్షల రుణంకు సంబంధించిన డబ్బులు తీసుకున్నాడు. అక్కడి నుంచి నేరుగా యూనియన్ బ్యాంకు(ఆంధ్ర బ్యాంకు)కు వచ్చి బంగారం కుదువబెట్టి రూ.2లక్షలు లోను తీసుకున్నాడు. రెండు బ్యాంకులలో తీసుకున్న నగదు మొత్తం రూ.3.10లక్షల నగదును ప్లాస్టిక్ కవర్‌లో పెట్టుకొని తన బైక్ కవర్‌లో పెట్టుకున్నాడు.

మంద రాజు ఇంటికి వచ్చే క్రమంలో బుక్‌స్టాల్‌లో నోట్ పుస్తకాలు తేవాలని కుమార్తె కోరగా యూనియన్ బ్యాంకు వద్ద నుంచి సుమారు 200 మీటర్ల దూరం వచ్చి బుక్ స్టాల్ వద్దకు చేరుకుని బైక్‌ను నిలిపాడు. స్టాండ్ వేసి అడుగు ముందుకు వేసే క్రమంలోనే రెప్పపాటులో బ్లాక్ స్కూటీపై ఇద్దరు గుర్తు తెలియని దొంగలు వచ్చి బైక్‌లో నుంచి డబ్బుల కవర్ తీసుకొని ఉడాయించారు. బాధితుడు లబోదిబోమంటూ దొంగల బైక్ వెంట పరుగెత్తినా లాభం లేకుండా పోయింది. అక్కడున్న వారు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయడంతో సీఐ జి.వేణు ఆధ్వర్యంలోని పోలీసు సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకొని సమీపంలోని దుకాణాలలో గల సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు.

కాగా, డివిజన్ కేంద్రంలోని ఆంధ్ర బ్యాంకు సమీపంలో గుర్తు తెలియని ఐదుగురు వ్యక్తులు చోరీకి పాల్పడేందుకు ఉదయం నుంచి కాపుకాసినట్లు సమాచారం. బాధితుడు మంద రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

శ్రీసీతారాములను దర్శించుకున్న కుసుమాంజలి

కొత్తగూడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడలో నూతనంగా వెలసిన శ్రీసీతారాములను పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క కోడలు కుంజ కుసుమాంజలి సూర్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం దర్శించుకున్నారు. స్వామివారికి పూజలు నిర్వహించారు. కొత్తగూడ, గంగారం మండలాల్లోని ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. గుంజేడులోని కాంగ్రెస్ పార్టీ నాయకుడు తోలెం అనంతరావు కూతురు శారీ ఫంక్షన్‌లోపాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో కుసుమాంజలి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకష్టాలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, పీసీసీ సభ్యులు చల్లా నారాయణరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, మాజీ సర్పంచ్‌లు మల్లెల రణధీర్, ఇర్ప రాజేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, సొసైటీ డైరెక్టర్ వజ్జ జంపయ్య, నాయకులు వేణు, ఐలయ్య, సయ్యద్, పాష, వెంకన్న, సిరిగిరి సురేష్, కుమార్, శ్రీను పాల్గొన్నారు.



కొత్తగూడలో శ్రీసీతారాములను దర్శించుకుంటున్న కుంజ కుసుమాంజలి సూర్య

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

ఇనుగుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అన్నకు బైక్ ఉందని, తనకూ బైక్ కొనివ్వాలని పట్టుబట్టి ఇంట్లో గొడవపడి క్షణికావేశంతో ఓ యువకుడు క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కాడబోయిన కుమార్ (24) ఈనెల 14న క్రిమిసంహారక మందు తాగగా, చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసముద్రం ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపిన ప్రకారం. కాడబోయిన శ్రీను-సుజాత దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. అవివాహితుడైన చిన్న కుమారుడు కుమార్ ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు.



కుమారస్వామి(ఫైల్)

ఈనెల 14న ఉదయం తనకు బైక్ కొనివ్వాలని తండ్రి శ్రీనును పట్టుబట్టాడు. పంట అమ్మిన డబ్బులు వచ్చాక కొనిస్తానని శ్రీను చెప్పినప్పటికీ కుమార్ వినకుండా గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అదేరోజు మధ్యాహ్నం గుంటిచెరువు వద్ద పురుగుల మందు తాగినట్లు తన అన్న సందీప్‌కు ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అక్కడే ప్రైవేటు ఆస్పత్రికి మార్చారు. చికిత్సపొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

'యూట్యూబ్ చానెల్‌పై చర్యలు తీసుకోవాలి'

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మున్నూరుకాపుల అస్తిత్వంపై మనోభావాలు దెబ్బతినేలా ఓ యూట్యూబ్ ఛానెల్ ప్రసారం చేయడం బాధకరమని, వెంటనే ఆ ఛానెల్ యాజమానిపై చర్యలు తీసుకోవాలని మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి మద్దెల రమేష్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుగు పిట్టల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ పెండ్యాల దేవేందర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్నూరుకాపు కులస్తులను వలసవాదులంటూ దూషిస్తూ యూట్యూబ్‌లో ప్రచారం చేయడం సరికాదన్నారు. వెంటనేఛానెల్ యాజమానిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేదాసు సుధాకర్, రావిశెట్టి చంద్రశేఖర్, మార్నేని కిరణ్‌కుమార్, శ్రీనివాస్, అవుల సతీష్, రామరాజు ఉపేందర్, చాపల వెంకన్న, ప్రవీణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

● తొర్రూరు : మున్నూరు కాపుల మనోభావాలు దెబ్బతినేలా ప్రసారం చేసిన ఓ చానల్‌పై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం ఆధ్వర్యంలో ఎస్సై ఉపేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మున్నూరుకాపు సంఘ అధ్యక్షుడు కొమ్ము దేవేందర్, భాస్కర్, శ్రీకాంత్, శివ, సునీల్, శేఖర్, గోపి, సంతోష్ ఉన్నారు.

20న ఆదర్శ రైతులకు అవార్డుల ప్రదానం

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిస్తున్న జిల్లాలోని 20 మంది ఆదర్శ రైతులను పద్మశ్రీ ఐవి.సుబ్బారావు, రైతునేస్తం 2024 పురస్కారాలను ఈనెల 20న కృష్ణాజిల్లా ఆత్కూర్‌లోని స్వర్ణభారత్ ట్రస్టులో ప్రధానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా నుంచి రైతులు తరలిరావాలని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ ఎడ్లపల్లి వెంకటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆదర్శ రైతులకు పురస్కారాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనదలిచిన రైతులు సెల్ : 97053 83666, 70939 73999 నెంబర్లకు ఫోన్‌చేసి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

కొండాపై అసంతృప్తి

- టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు
- తమ నియోజకవర్గాల్లో మంత్రి సురేఖ జోక్యంపై ఫిర్యాదు
- పరకాల, వరంగల్ తూర్పులో విభేదాలపై వివరణ
- పార్టీ అంతర్గత విషయాలపై రచ్చకెక్కవద్దని టీపీసీసీ హితవు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ వైఖరిపై పార్టీలో అసంతృప్తి మరింత పెరుగుతోంది. ఈ క్రమంలోనే ఆమెపై ఫిర్యాదుల పర్వం కొనసాగుతోంది. తమ నియోజకవర్గాల్లో తలదూర్చుతున్నారని ఎమ్మెల్యేలు, ఓరుగల్లు నేతలు అసంతృప్తితో ఉన్నారు. మంగళవారం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షికి ఫిర్యాదు చేయగా.. తాజాగా బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి మంత్రి తీరుపై ఫిర్యాదు చేయటం కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. ఇప్పటికే తన వ్యాఖ్యలతో రాష్ట్రవ్యాప్తంగా వివాదస్పదంగా మారిన మంత్రి సురేఖ, సొంత జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటుండటం రాజకీయవర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

ఎమ్మెల్యేల తిరుగుబాటు బావుటా..

మంత్రి కొండా సురేఖపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీతో పాటు ముగ్గురు డీసీసీ అధ్యక్షులు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, కీలక నేతలు రెండు రోజులుగా వరుస ఫిర్యాదులు చేస్తున్నారు. మంగళవారం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షిని కలిసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షులు మంత్రి సురేఖ తమ నియోజకవర్గాల్లో తల దూర్చటమే కాకుండా, నామినేటెడ్ పదవులు కూడా తన అనుచరులకు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి.. మంత్రి వైఖరితో పార్టీ తీవ్రంగా నష్టపోతోందని వివరించినట్లు సమాచారం. తమ నియోజకవర్గాల్లోని దేవాలయాల కమిటీలను కూడా తాము సూచించిన వారికి ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పార్టీ పటిష్టత కోసం అధిష్ఠానం చేరికలను ప్రోత్సహిస్తే, పార్టీలో చేరిన వారిని లక్ష్యంగా చేసుకుని కొండా దంపతులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు సమాచారం.

అలాగే పరకాల నియోజక వర్గంతో సంబంధం లేకపోయినా కావాలనే జోక్యం చేసుకుని, వర్గవిభేదాలను ప్రోత్సాహిస్తున్నారని, మంత్రి స్థాయిలో ఉండి గీసుగొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌హెచ్‌వో సీట్లో కూర్చోవటం, దసరా మరుసటి రోజు ధర్మారం వద్ద ధర్నా చేయటం లాంటి వాటితో ప్రజల్లో పార్టీపై వ్యతిరేకత రావడానికి కారణమవుతున్నారని వివరించినట్లు తెలుస్తోంది. ఇందుకు స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సీఎంతో చర్చించిన అనంతరం మంత్రితో కూడా మాట్లాడుతామని, భవిష్యత్తులో ఇలాంటివి జరుగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చినట్టు సమాచారం. పార్టీ అంతర్గత విషయాలపై రచ్చకెక్కవద్దని, అంతర్గతంగా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని, కింది స్థాయి క్యాడర్ రెచ్చకొట్టే వాఖ్యలు చేయకుండా సమన్వయంతో పని చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు వారికి సూచించినట్లు తెలిసింది.

కొండాపై ఫిర్యాదు వెనుక ఉన్నదెవరు?

మంత్రి సురేఖ వైఖరిపై కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడం వెనుక ఎవరున్నారు? ఆ పెద్ద తల ఎవరనే చర్చ జరుగుతోంది. గీసుగొండ ఘటన తరువాత ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలందరిని ఏకతాటిపైకి తీసుకొవచ్చి, సురేఖపై ఫిర్యాదు చేయించేంత సాహసం ఎవరు చేశారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పరకాల, వరంగల్ పశ్చిమ, స్టేషన్‌ఘనపూర్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో కొండా దంపతులు కొంత జోక్యం చేసుకున్న సంఘటనలున్నాయని, కానీ మరికొన్ని నియోజకవర్గాలకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా మంత్రిపై ఫిర్యాదుకు ఆ ప్రాంత నేతలు ఎలా వచ్చారని కొండా వర్గీయులు ఆరా తీస్తున్నట్లుగా సమాచారం. వివాదాలకు చాల దూరంగా ఉండే ఓ ఎమ్మెల్యే కూడా అధిష్ఠానాన్ని కలిసిన వారిలో ఉండటం చర్చనీయాంశంగా మారింది. చివరకు ఓరుగల్లు రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ లక్ష్యంగా జరుగుతున్న పరిణామాలు ఎటు దారితీస్తాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

పేద బతుకుల్లో వెలుగులేవీ?

- రోజులు మారుతున్నా వీడని పేదరికం
- ఇప్పటికీ కూడు, గూడు కోసం లక్షలాది కుటుంబాల తండ్లాట

హనుమకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాలం మారుతున్నా.. పరిస్థితులు మారుతున్నా.. పేదల జీవితాలు మాత్రం మారడం లేదు. సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతల జాడలు నేటికీ కనిపిస్తున్నాయి. కోట్లాది కుటుంబాలు కూడు, గూడు, గుడ్డ లాంటి మౌళిక సదుపాయాలు లేక అల్లాడుతున్నాయి. ఇప్పటికీ అనేక మంది కనీసం ఒక్క పూట కూడా కడుపునిండా భోజనం దొరక్క ఆకలితో అలమటిస్తున్నారు. తలదాచుకునేందుకు సరైన నీడ లేక వేసారిపోతున్నారు. దశాబ్దకాలంలో పట్టణాల్లో పెరిగిన మురికివాడల సంఖ్యే ఇందుకు ఉదాహరణ. అయితే జనాభ గణన జరిగిన 2011-12 సంవత్సరంతో పోల్చితే మాత్రం కొద్ది మేరకు పేదరికం స్థాయిలు కొంత మేరకు తగ్గినట్టు స్పష్టమవుతోంది. కేంద్ర ప్రభుత్వ నిర్వహించిన ఆర్థిక, సామాజిక తాజా సర్వే ప్రకారం 2011-12లో గ్రామీణ పేదరికం 39.4 శాతం, పట్టణ పేదరికం 38.1 శాతం ఉండగా 2022-23 సంత్సరం నాటికి పేదరికం 37.6 శాతం, పట్టణ పేదరికం 25.4 శాతం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్షలాది కుటుంబాల పరిస్థితి ఇంకా అట్టగునే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన సర్వేలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లాని మెజారిటీ ప్రజలు పేదరికంలోనే మగ్గుతున్నారు. నెలకు రూ. 10వేల కన్నా తక్కువ ఆదాయం ఉండి, పెద్దగా భూమికానీ, సొంతానికి వాహనం కానీ లేని గ్రామీణులను పేదల కింద పరిగణిస్తారు. గురువారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేదరికం స్థాయిలు, అందుకు కారణాలు, పేదరికం నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేక కథనం.

తలసరి ఆదాయంలో అట్టడుగున

ఒక దేశం లేదా భౌగోళిక ప్రాంతంలో ఒక వ్యక్తి సంపాదించిన డబ్బుకు కొలమానంగా తీసుకునే తలసరి ఆదాయం.. జనాభా జీవన ప్రమాణం జీవన నాణ్యతను అంచనా వేయడానికి ఉపయోగించబడుతుంది. అలాంటి తలసరి ఆదాయం విషయంలో ఉమ్మడి వరంగల్ మిగతా జిల్లాల కన్నా వెనుకబడి ఉంది. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వే గణాంకాల ప్రకారం తలసరి ఆదాయంలో జయశంకర్ భూపాలపల్లి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా కాస్త ముందుంది. ఆ జిల్లా రూ.2,71,555తో రాష్ట్రంలో ఐదో స్థానంలో ఉండగా.. హనుమకొండ జిల్లా రూ.1,86,784తో అన్నిటికన్నా అట్టడుగున 30వ స్థానంలో ఉంది. ములుగు జిల్లా రూ. 197,539తో 25వ స్థానంలో, రూ. 2,17,277 తలసరి ఆదాయంతో జనగామ 19వ స్థానంలో ఉంది. ఇక వరంగల్ జిల్లా రూ. 2,22,628తో 15వ స్థానం, మహబూబాబాద్ జిల్లా రూ.1,99,588తో 22వ స్థానంలో ఉంది.

పేదరిక నిర్మూలన దిశగా..

గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు 2000 సంవత్సరం నుంచి ఊపందుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా ప్రత్యేక కార్యాచరణను చేపట్టాయి. ఇందులో భాగంగా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తునాయి. 2000 నుంచి గ్రామీణ నిరుపేద నిర్మూలనా సంస్థ (సెర్ప్), పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పేదలను గుర్తించడం మొదలైంది. అయితే పేదలను భాగస్వామ్య పద్ధతిలో పేదల ద్వారానే గుర్తించే విధానాన్ని (పీఐపీ) అమలు చేస్తున్నారు. పేదలంటే ఎవరు? ఎలాంటి వారిని పేదలంటారు? అనేవి గుర్తించి వర్గీకరించారు. మొదటి కేటగిరి అత్యంత నిరుపేదలు, రెండోది పేదలు. మూడోది పేదలు కానివారు. మొదటి రెండు కేటగిరీలు లక్ష్యంగా ఆ కుటుంబాల్లో మహిళలందరినీ మొదట సాచురేషన్ మోడ్‌లో పేదరిక నిర్మూలన కార్యక్రమాలను అమలు చేయడం భాగస్వాములను చేయడం మొదలు పెట్టారు.

నేడు అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం



సంఘటితంగా సత్ఫలితాలు..

పేదరిక నిర్మూలన అనేది వ్యక్తిగతంగా కాక సంఘాల ద్వారా సంఘటితంగానే సాధ్యమవుతుంది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా కార్యక్రమాలను చేపట్టాయి. కుటుంబాల్లో కీలకమైన మహిళలు లక్ష్యంగా తీసుకుని వారికి ఆర్థికంగా, సామాజికంగా సుస్థిరతను సాధించగలిగితే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్న వ్యూహంతో స్వయం సహాయ సంఘాలను ఏర్పాటు చేశారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా పది నుంచి పదిహేను మంది సభ్యులతో సంఘాలను రూపొందించారు. వారిని ఆర్థిక స్వావలంబన వైపు నడిపే దిశగా ప్రోత్సహించారు. తొలుత వాడలు, ఆతర్వాత గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో సమాఖ్యలను ఏర్పాటు చేశారు. దాంతో ఆయా స్థాయిల్లో అధికారులు, కలెక్టర్లు సమావేశాలకు హాజరవడంతో సమస్యల పరిష్కారం సులువైంది. అలాగే సంఘాలు సమర్థవంతంగా పనిచేసేలా సామర్థ్యాల పెంపు శిక్షణనిచ్చారు. ఇతరులపై ఆధారపడకుండా ప్రభుత్వం అందించే సాయంతో ఆర్థిక సుస్థిరతను ఎలా సాధించాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ చర్యలతో కొంతమేర సత్ఫలితాలు వచ్చాయన్నది గణాంకాలు చెబుతున్నాయి.

బ్యాంకుల అనుసంధానం

ఎంత చేసినా డబ్బులు అవసరం కనుక పేదరికం నుంచి బయటపడటానికి అవసరమైన ఉపాధి అవకాశాల కల్పనకు గాను ప్రతీ మండలానికి సీడ్ క్యాపిటల్ కింద రూ.80లక్షల వరకు ఇచ్చారు. వీటిని సంఘాలు రొటేషన్ చేసుకుంటూ సుస్థిర ఆదాయ కల్పనకు బాటలు వేసుకుంటున్నాయి. దీంతో ప్రతీ మండలం సంఘాలు రూ. 2 నుంచి రూ. 3 కోట్ల వరకు టర్నోవర్ చేసుకునే స్థాయికి చేరుకున్నాయి. కొన్ని మండలాల టర్నోవర్ అయితే రూ. 5 కోట్ల వరకు ఉంది. అయితే ఈ డబ్బుతోనే సరిపెట్టకుండా ఆర్థికంగా మరింత ముందుకు వెళ్లేందుకు వీలుగా ఈ సంఘాలను బ్యాంకులతో కూడా అనుసంధానం చేశారు. ప్రతీ సంవత్సరం ఆదాయాభివృద్ధి కోసం రూ.10కోట్ల వరకు బ్యాంకులు రుణాలిస్తున్నాయి. తద్వారా సంఘాల్లోని సభ్యులు తమకు తెలిసిన వృత్తి ఆధారంగానే ఉపాధి అవకాశాలు కల్పించుకుంటున్నాయి. ఇంతటితో సరిపెట్టుకోకుండా రెండేళ్లుగా గ్రామ సంఘానికి 80 కుటుంబాలు కచ్చితంగా పేదరికం నుంచి బయటకు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం 'లక్‌పతి దీదీ యోజన' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ గ్రామ సంఘంలో 80 మంది ఒకటికన్నా ఎక్కువ ఉపాధి మార్గాలను చేపట్టేలా ప్రోత్సహిస్తున్నారు. తద్వారా గతంలో కన్నా ఇప్పుడు గ్రామ స్థాయిలో సంఘాల ద్వారా మెరుగైన ఉపాధిని పొందుతున్నారు. తద్వారా పేదరికం నుంచి కొంతమేరకైనా తగ్గుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1800లకుపైగా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇవి సమర్థవంతంగా పని చేస్తున్నాయి. బ్యాంకులు కూడా ఒక్కో మండల సమాఖ్యకు కుటీర పరిశ్రమల స్థాపనకు రూ 20 కోట్ల వరకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు వస్తున్నాయి.



పేదరిక నిర్మూలన కోసం..

గ్రామీణ పేదరిక నిర్మూలనతో పాటు పట్టణాల్లో పేదరిక నిర్మూలన కోసం పలు కార్యక్రమాలు అమలవుతున్నాయి. పట్టణపేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, స్వయం ఉపాధి కార్యక్రమం (ఎస్ఈపీ), బ్యాంకు రుణాలు, వీధి విక్రయదారుల పథకం (పీఎంఎస్‌వీఏ నిధి), ఇందిరా మహిళా శక్తి పథకం అమలు అవుతున్నాయి. వీటి ద్వారా కోట్లాది రూపాయల టర్నోవర్‌తో స్వయం ఉపాధి కల్పన జరుగుతోంది.



గిజిగాళ్ల గూళ్లు.. అదిరెన్..

గిజిగాడుగా పిలుచుకునే బయవీవర్ అనే పిట్ట గూడు నిర్మించుకునే విధానం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. గడ్డిపుల్లలను ఒక్కొక్కటిగా సేకరించి గూడును నిర్మించి అందులో ఆకులను పేర్చుకుంటుంది. ముచ్చటగొలిపే ఆ గూడును పూర్తిచేసేందుకు ఆ పిట్టకు చాలారోజుల సమయం పడుతుంది. ఈ పక్షులు ఒకే చెట్టుకు పదుల సంఖ్యలో గూళ్లను ఏర్పాటు చేసుకుంటాయి. ఇలా హనుమకొండ కాజీపేట దర్గా ఇందిరమ్మ కాలనీలో ఓ చెట్టుపై గిజిగాళ్లు సందడి చేశాయి.

- ఫొటోలు : 'ఆంధ్రజోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

ఘనంగా వీణ, వాణి పుట్టినరోజు


అవిభక్త కవలలతో కేక్ కట్‌చేయించిన తల్లిదండ్రులు, అధికారులు


వీణ, వాణికి కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

దంతాలపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అవిభక్త కవలలు వీణ, వాణీ పుట్టినరోజు వేడుకలను వారి స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని బీరిశెట్టిగూడెంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీరిశెట్టిగూడేనికి చెందిన మారగాని మురళి-నాగలక్ష్మి దంపతుల కుమార్తెలైన వీణ, వాణి ప్రస్తుతం హైదరాబాద్ చైల్డ్‌హోం సంరక్షణలో ఉంటూ సీఏ చదువుతున్నారు. బుధవారం వారి 22వ పుట్టినరోజు కావడంతో హైదరాబాద్ చైల్డ్‌హోం అధికారులు సఫీయా, సోమలక్ష్మి సంరక్షణలో అవిభక్త కవలలను స్వగ్రామానికి తీసుకొచ్చి వేడుకలు నిర్వహించారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, దంతాలపల్లి తహసీల్దార్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించిన అనంతరం తిరిగి చైల్డ్‌హోం అధికా రులు వారిని హైదరాబాద్ తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది చంద్రశేఖర్, ఎంపీడీవో వివేక్‌రామ్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్‌స్వామి, ఎంపీవో అప్సర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించి.. చదువులో రాణించి..

- టీచర్ ఉద్యోగం సాధించిన సింధూజ
- ఆర్థిక ఇబ్బందులను ఇబ్బందులను అధిగమించి కొలువు బాటలో..
- ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో విజయం


తోలెం సింధూజ

కొత్తగూడ, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి) : ఆమెది నిరుపేద కుటుంబం. మూడేళ్ల వయస్సులో తండ్రిని కోల్పోయింది. రెక్కల కష్టాన్ని నమ్ముకున్న తన తల్లి తనపై పెట్టుకున్న నమ్మకానికి 'కొలువు' రూపం ఇచ్చింది. నాన్నలేడన్న బాధను దిగమింగుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి.. తన ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో ఉన్నత విద్యనభ్యసించి.. టీచర్ కొలువు కొట్టేసి ఆదర్శంగా నిలిచింది తోలెం సింధూజ. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఉమ్మడి మండలంలోని పుట్టల భూపతి గ్రామానికి చెందిన తోలెం సారయ్య-రజిత దంపతులకు కుమార్తె సింధూజ, కుమారుడు రఘు ఉన్నారు. సింధూజకు మూడేళ్ల వయసున్నప్పుడు తండ్రి సారయ్య చనిపోవడంతో తల్లి రజిత కూలీ పనులు చేసి ఆమెను చదివించింది. ఇక సింధూజకు పద్నాలుగేళ్ల వయసులో ఉన్నప్పు డు ఆమె తమ్ముడు రఘు అనారోగ్యంతో మృతి చెందాడు. అయినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా.. తొలినుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నా.. ఆర్థిక ఇబ్బందులున్నా అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. అయితే పదో తరగతిలో ఉన్నప్పుడు కుటుంబ పరిస్థితుల కారణంగా కొన్ని రోజులపాటు సింధూజ చదువు మానేసింది. కానీ ఉత్తమ మార్కులు సాధించే సింధూజ చదువు మానేసిందని తెలుసుకున్న ఉపాధ్యాయుడు వాసం వీరస్వామి ఆమె ఇంటికి వెళ్లి చదువుతోనే భవిష్యత్తు ఉంటుందని కౌన్సెలింగ్ ఇచ్చి చదువువైపు మళ్లించారు. ఆ తర్వాత గంగారంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2018లో 10వ తరగతి పూర్తిచేసిన సింధూజ 2020లో నర్సంపేటలో త్రివేణి కళాశాలలో ఇంటర్, 2022లో భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన డైట్ కళాశాలలో టీటీసీ పూర్తి చేసింది. ఐటీడీఏ రామయ్య కోచింగ్ సెంటర్‌లో 2023లో మూడునెలలు డీఎస్సీ కోచింగ్ తీసుకుంది. అలా ఉపాధ్యాయుడు వాసం వీరస్వామి.. సింధూజ ఉపాధ్యాయురాలి కొలువు కొట్టే వరకు ఆమెను ప్రోత్సహించారు. కొలువు కొట్టే క్రమంలో సింధూజ ఆయన మార్గదర్శకాలను తూచతప్పకుండా పాటించి విజయం సాధించింది. బుధవారం ఆమె కొత్తగూడ ఉమ్మడి మండలంలోని మర్రిగూడెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు స్వీకరించింది. ఆ గ్రామంలో ఉద్యోగం పొందిన మొదటి యువతిగా సింధూజను గ్రామస్థులు అభినందించారు.

అమ్మవారిని దర్శించుకున్న చీఫ్ విప్

వరంగల్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారిని ప్రభుత్వ చీఫ్ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయానికి వచ్చిన వారికి ఆలయ ప్రధానార్చకుడు శేషు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆది శ్రీనివాస్ దంపతులు వల్లభ గణపతి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు వారికి అమ్మవారి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ దంపతులు

మిద్దె తోట.. ఆరోగ్య పంట

- సేంద్రియ విధానంలో పెంపకంపై నగరవాసుల ఆసక్తి
- ఇంటికి సరిపడా కూరగాయలు మిద్దెతోటలోనే లభ్యం
- పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ ఉత్సాహంగా పెంపకం

ఇంటిపైన తీరొక్క కూరగాయల సాగు


ఇంద్రారెడ్డి ఇంటి మిద్దెపై పెంచుతున్న పూలు, కూరగాయల మొక్కలు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో ప్రస్తుతం రూ.600పెట్టినా వారానికి సరిపడా కూరగాయలు వచ్చే పరిస్థితి లేదు. రోజురోజుకు పెరుగుతుతున్న జనాభాకు తోడు కూరగాయల ఉత్పత్తి తగ్గుతుండటం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుండటం ధరల పెరుగుదలకు కారణమవుతోంది. కోతులు, వణ్యప్రాణులు, పక్షులతో ఇబ్బందితోపాటు మార్కెటింగ్ సమస్యలతో రైతులు కూరగాయల సాగుపై దృష్టి పెట్టడం లేదు. వీటికి తోడు చీడపీడల బెడద ఎక్కువవడం వాటిని నియంత్రించేందుకు క్రిమిసంహారక మందులను వినియోగిస్తుండటంతో కూరగాయలు విషపూరితమై ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో చాలా మంది నగర, పట్టణ ప్రజలు సేంద్రియ పద్ధతిలో సాగయ్యే పంట ఉత్పత్తులపై ఆసక్తి చూపుతున్నారు. కొందరైతే మిద్దె, పెరటి తోటలను పెంచుతున్నారు. రసాయన ఎరువులు వాడకుండా వంటింటి వ్యర్థాలను పోగు చేసి సేంద్రియ ఎరువులుగా మార్చి కూరగాయల మొక్కలు పెంచుతున్నారు. అంతర్జాలం వేదికగా చీడపీడల గురించి తెలుసుకుంటూ వాటికి విరుగుడుగా కషాయాలను తయారుచేస్తూ దిగుబడి పొందుతున్నారు. పెరటి, మిద్దె తోటల్లో పనితో వ్యాయామంగా ఉండటంతో పాటు పచ్చని మొక్కల మధ్య గడపడంతో ఉత్సాహంగా ఉంటోందని, పచ్చని స్వచ్ఛమైన గాలి కూడా తమకు అందుతోందని నగరంలో మిద్దెతోటలు సాగుచేస్తున్న వారు పేర్కొంటున్నారు.

పట్టణాల్లో పెరుగుతున్న మిద్దెతోటల సాగు

గతంలో వేళ్లమీద లెక్కపెట్టే విధంగా ఇళ్లపైన కూరగాయలు, పూలమొక్కలు సాగుచేసేవారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో మేడపైన వీటిని పెంచుతున్న సంఖ్య ఇప్పుడు వేలల్లోకి చేరింది. హనుమకొండ, వరంగల్, కాజీపేట పట్టణాల్లో సుమారు 500మందికి పైగా సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2వేలకు పైగా కూరగాయలు, పూలమొక్కలు సాగుచేస్తున్నట్టు సమాచారం. కొందరు పల్లెల్లో ఇంటి ఆవరణలో ధరలు ఎక్కువగా ఉండే వాటిని పండిస్తూ ఇంటి అవరాలకు వాడుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లోని ఇళ్లలో ఈ తరహా పెరటి తోట సంస్కృతి పెరిగితే కూరగాయల పరంగా ఆర్థిక భారం తగ్గుతుంది.

ఎవరైనా పండించొచ్చు..

టమాట, వంకాయ, బీర, దొండ, సొరకాయ, గోరుచిక్కుడు, బెండ లాంటి కూరగాయలు, పాలకూర, చుక్కకూర, గోంగూర, పుదీన, కరివేపాకు, కొత్తిమీర లాంటి ఆకుకూరలు ఇంటి ఆవరణలో, మేడపైన సులభంగా సాగు చేసుకోవచ్చు. వీటిని పెంచడం ఏమంత కష్టం కాదు. ఒక్కసారి మంచి మట్టిని, సేంద్రియ ఎరువులను వాడి విత్తనాలు వేసి అవసరాన్ని బట్టి నీళ్లు అందిస్తే 20 నుండి 30రోజుల వ్యవధిలోనే తాజా కూగరాయలు అందుబాటులోకి వస్తాయి. కొన్ని కొన్ని కుండీల్లో తక్కువ చోటులో పెరిగే మొక్కలు లభ్యమవుతున్నాయి. 60చదరపు అడుగుల నుంచి 100 చదరపు అడుగుల్లో అయితే తీరొక్క కాయగూరలను వేసుకోవడం సులభం.

హైదరాబాద్ తరహాలో జిల్లాల్లో కిట్‌లు అందిస్తే మేలు..

హైదరాబాద్ పట్టణంలో మిద్దెతోటల సాగుకు ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందుతోంది. రూ.6వేల విలువైన కిట్‌ను రూ.3వేలకు అందిస్తున్నారు. ఇందులో కొన్ని రకాల విత్తనాలతోపాటు మొక్కల సంచులు, నీళ్లను పోసే పరికరం, సేంద్రియ ఎరువులు, సూచనలు, జాగ్రత్తలపై కరపత్రాలను ఇస్తున్నారు. ఇలాంటి ప్రోత్సాహకాన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వం అందిస్తే ఇళ్లలో కూరగాయల పెంపకం పెరిగే అవకాశం ఉంటుంది.


నందనవనాన్ని తలపిస్తున్న ఇంద్రారెడ్డి ఇల్లు

మొక్కల పెంపకం నాకు మక్కువ

జన్నపురెడ్డి ఇంద్రారెడ్డి, ప్రశాంత్‌నగర్, హనుమకొండ



పచ్చదనమంటే చాలా ఇష్టపడతా. నగరంలో ఉంటున్నందున ఇంటిపైన గ్రీనరీ ఏర్పరుచుకోవాలన్న ఆలోచన వచ్చింది. కూరగాయలు, పూలమొక్కలు పెంచితే ఇంట్లోకి అవసరంతోపాటు నా అభిరుచికి తగ్గట్టు ఉంటుందని ఇంటిపైన, ఇంటి చుట్టు 70రకాల పూలమొక్కలతో పాటు కూరగాయలైన బీర, సొర, కాకర, పొట్లకాయ, వంకాయ, టమాట, మిర్చితోపాటు తోటకూర, చుక్కకూర, పుదీన, పాలకూర, కొత్తిమీర లాంటివి పెంచుతున్నా.

క్రైం కార్నర్

బైక్ దొంగ అరెస్టు

కొడకండ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బైక్‌లను చోరీ చేస్తున్న ఓ వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. కొడకండ్ల పోలీ‌స్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో 6నెలల క్రితం స్ప్లెండర్ బైక్, కొడకండ్ల మండలం మొండ్రాయిలో ఈనెల 12న గ్లామర్ బైక్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దొండపాటి చందు దొంగిలించినట్లు తెలిపారు. ఈ మేరకు అరెస్టు చేసి బైక్‌లను రికవరీ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకున్న స్థానిక ఎస్ఐ సీహెచ్. రాజును, పోలీసు సిబ్బందిని సీఐ మహేందర్‌రెడ్డి అభినందించారు.

పోస్ట్‌మన్‌పై కుక్కల దాడి

చిలుపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడిలో పోస్ట్‌మన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని మల్కాపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం... వేలేరు మండలం పీచరకు చెందిన ఒడ్డెపల్లి క్రాంతి మల్కాపూర్‌లో పోస్ట్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం స్థానిక సబ్ పోస్టాఫీ‌స్‌లోకి వెళ్తుండగా ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. ఈ ప్రమాదంలో క్రాంతి కాలుకు తీవ్ర గాయమైంది. గ్రామంలో కుక్కల బెడద తీవ్రం కావడంతోపంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

జనగామ విద్యార్థులకు శుభవార్త

ఐదు సంవత్సరాల కృషికి ఫలితం



జనగామలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

జనగామ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని ఆంధ్ర భాషాభివర్ధిని(ఏబీవీ) ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి లభించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1975లో ప్రారంభమై ప్రైవేటు డిగ్రీ కళాశాలగా, ఎయిడెడ్ కళాశాలగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా అంచెలంచెలుగా ఎదుగుతూ స్వయం ప్రతిపత్తి హోదాకు చేరుకుంది. దేశంలో అత్యున్నత విద్యా ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థలకు యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్) ఈ హోదాను అందజేస్తుంది. డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా రావడం పట్ల మేధావి వర్గాలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్ల కృషికి ఫలితం..

జనగామలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి తీసుకురావడానికి ఐదు సంవత్సరాలుగా ఎనలేని కృషి జరిగింది. కళాశాల లోని అన్ని విభాగాలలో ఎదుగుదల, లాబొరేటరీ ఎక్విప్‌మెంట్, పరీక్షా ఫలితాల శాతం, విశ్లేషణ, కళాశాలలో పూర్తి స్థాయి సిబ్బంది, అన్ని విభాగాలకు ప్రత్యేక భవనాలు, మౌలిక సదుపాయాలు మొదలగు వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు బెంగళూరులోని యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ)కి పంపిస్తారు. యూజీసీ నుంచి ప్రత్యేక అధికారులు ప్రతి సంవత్సరం కళాశాలను సందర్శించి అన్ని విభాగాలలో ఉన్న ఎదుగుదలను పరిశీలించారు. ఈ ప్రక్రియ ఐదు సంవత్సరాలుగా కొనసాగుతుండగా ఈ సంవత్సరం ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను స్వయం ప్రతిపత్తి హోదా వరించింది.

కోర్సులు..

ప్రస్తుతం ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న కోర్సుల వివరాలిలా ఉన్నాయి. బీఎస్సీ విభాగంలో ఫిజికల్ సైన్స్, ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంసీసీఎస్, బీఎస్సీ లైఫ్ సైన్స్ విభాగంలో బీజెడ్‌సీ, బీజెడ్‌సీస్, బీసీసీఎస్, జెడ్‌సీసీఎస్, బీకామ్ కంప్యూటర్స్, బీఏ జనరల్, బీఏ కంప్యూటర్స్ కోర్సులు నిర్వహిస్తుండగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉంది.

సదుపాయాలు ఇవీ..

ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక, ఇతర సదుపాయాలు ఇలా ఉన్నాయి. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బాటనీ ల్యాబ్, జువాలజీ ల్యాబ్, ఫిజిక్స్ ల్యాబ్, కెమిస్ట్రీ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, 26వేల పుస్తకాలతో ప్రత్యేక గ్రంథాలయ భవనాలున్నాయి. ఇంకా వ్యాయామ శాల, ప్లే గ్రౌండ్, గార్డెనింగ్ కళాశాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాశాలలో ప్రిన్సిపాల్‌తో కలిపి 13మంది రెగ్యులర్ అధ్యాపకులు, ఇద్దరు కాంట్రాక్టు అధ్యాపకులు, 7గురు అతిథి అధ్యాపకులు ఉన్నారు. అంతేగాకుండా ఐదుగురు రెగ్యులర్ బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. ఐదుగురు రెగ్యులర్ సబార్డినేట్లు, ముగ్గురు ఔట్ సోర్సింగ్ సబార్డినేట్లు ఉన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, ఎన్‌సీసీలో యూనిట్-1, 2, 3 విభాగాలు పని చేస్తున్నాయి. ప్రస్తుతం కళాశాలలో 480 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

లాభాలు ఇవీ..

ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి సాధించడం పట్ల మేధావి వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. స్వయం ప్రతిపత్తి ద్వారా కళాశాలకు యూనివర్సిటీ హోదా లభిస్తుంది. అంటే కళాశాలలోని ఆయా కోర్సులకు సంబంధించి సిలబస్, ప్రశ్నా పత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ, పేపర్ల వాల్యుయేషన్, ఫలితాలు మొదలగునవి ఇక నుంచి కళాశాలలోనే జరుగుతాయి. అంతేగాకుండా కొత్త కోర్సులు, బాయ్స్ హాస్టల్, వుమెన్ హాస్టల్ నిర్వహణకు యూజీసీ దాదాపు రూ.5కోట్ల వరకు నిధులు విడుదల చేస్తుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ ఎ.నర్సయ్య, ప్రిన్సిపాల్, ఏబీవీ డిగ్రీ కళాశాల



డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించడం ఈ ప్రాంత విద్యార్థులందరికీ సంతోషదాయకం. స్వయం ప్రతిపత్తి ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించే కోర్సులను రూపొందించుకునే అవకాశం లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి హాస్టళ్ల నిర్మాణం, అదనపు తరగతుల నిర్వహణ చేపట్టవచ్చు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

వినియోగదారులకు అందుబాటులో ఉండాలి

పాలకుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ ట్రాన్స్‌కో డీఈ రాంబాబు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యుత్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో రాంబాబు మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు వస్తే వెంటనే మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ హెచ్చు, తగ్గులుంటే గమనించి సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఆయన వెంట ఏఈలు, రణధీర్, సత్తయ్య, రామలు, సబ్ ఇంజనీర్లు రాకేష్, మాన్విత, లైన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

తరిగొప్పుల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతగట్టునాగారంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పోషకాహారం లోపంతో బాధపడుతున్న చిన్నారులకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందన్నారు. గ్రామాల్లో బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం పట్ల నిరంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి ప్రహరి గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి దేవేందర్ రెడ్డి, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికుల కోసమే కాటమయ్య రక్షణ కవచం

జనగామ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గీతకార్మికుల రక్షణ కోసమే కాటమయ్య రక్షణ కవచాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం గీత కార్మికులకు ఎమ్మెల్యే పల్లా కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నిత్యం ఎక్కడో ఒకచోట గీత కార్మికులకు ప్రమాదాలు సంభావిస్తున్నాయన్నారు. కల్లుగీత కార్మికుల సంక్షేమం, రక్షణ కోసం కాటమయ్య రక్షణ కవచాలు అనేక విధంగా దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భైరగోని యాదగిరిగౌడ్, ఎక్సైజ్ అధికారులు, గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

19న హార్ట్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు

జనగామ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మాతృదర్శన్ ట్రస్టు, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 19న హార్ట్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలో హెల్త్‌క్యాంపు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 19న చంపక్‌హిల్స్‌లోని మాతృదర్శన్ ట్రస్టు కార్యాలయంలో నిమ్స్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్, జేవీవీ గౌరవాధ్యక్షుడు దాసరి ప్రసాదరావు ఆధ్వర్యంలో అపోలో స్పెక్ట్రో హాస్పిటల్ సౌజన్యంతో హార్ట్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బానోతు రవీందర్, అనంతోజు ఉమాదేవి, నిడిగొండ చంద్రశేఖర్, శ్రీనివాసాచారి, కనకయ్య, శోభన్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

నర్మెట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య, ఎటువంటి రోగులు ఎక్కువగా వస్తున్నారు, ఏ విధమైన సేవలు అందిస్తున్నారు, మందులు అందుబాటులో ఉన్నాయా? అని డాక్టర్ స్టెల్లా, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సమస్యలు ఉంటే జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకవెళ్లాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ కొరత ఉందని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి, రోగులకు వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రవీందర్, కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లు లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలి

దేవరుప్పుల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్న పైపులైన్లు లీకేజీలు కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఏఈ మానస కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరం నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీరోజు ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్న సందర్భంలో పైప్‌లైన్, గేట్‌వ్వాల్ లీకేజీలు కాకుండా ఎప్పటికప్పుడు బిగిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లీకేజీల ద్వారా కలుషితమైన నీరు అందించకుండా చూసుకోవాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో సురేష్, శిక్షకులు పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డికి నేతల పరామర్శ

పాలకుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తొర్రూరులో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని హైదరాబాద్‌లో బుధవారం మండలంలోని కాంగ్రెస్ నేతలు పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, సంతోష్, యాకయ్య ఉన్నారు. అనంతరం త్వరగా ఝాన్సీరెడ్డి కోలుకోవాలని యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

బచ్చన్నపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలో పతాకావిష్కరణ కార్యక్రమం జరిగింది. హాజరైన కనకారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వెళుతుందన్నారు. ప్రశ్నించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. కార్పొరేట్ సంస్థల బాగుకోసం దేశంలోని సంపదను దోచిపెట్టేందుకు సిద్ధపడిందన్నారు. రాష్ట్రంలో ప్రజామోద పాలన కొనసాగటం లేదన్నారు. ఇంటి స్థలాల కోసం గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని, ఇళ్లు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో సుంచు విజేందర్, బెల్లంకొండ వెంకటేశ్, పర్వతం నర్సింహులు, రామగళ్ల అశోక్ పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరా ప్రభుత్వ లక్ష్యం

లింగాలఘణపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ప్రతీ పల్లెకు సురక్షిత తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి స్వరూప అన్నారు. బుధవారం లింగాలఘణపురం మండలం బండ్లగూడెం రైతువేదికలో మండలానికి చెందిన 21 గ్రామపంచాయతీల వాటర్‌మెన్లకు మిషన్ భగీరథ ప్రాజెక్ట్ అధికారులు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డీపీవో ముఖ్య అతిథిగా హాజరై సురక్షిత తాగునీటి సరఫరా ప్రక్రియలో వాటర్‌మెన్లు తీసుకోవాల్సిన చర్యలు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలందర్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, మిషన్‌భగీరథ ఏఈ రోహిణి పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ట్రాన్స్‌కో ఏఈ

చిలుపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవరం సెక్షన్ ట్రాన్స్‌కో ఏఈగా లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు విధులు నిర్వర్తించిన రమేష్ కన్‌స్ట్రక్షన్ విభాగం జనగామకు బదిలీపై వెళ్ళగా, అదే విభాగంలో పని చేసిన లక్ష్మీనారాయణ ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఏఈ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ మోటార్లకు నిరంతర విద్యుత్తును అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యుతు సిబ్బంది నూతన ఏఈని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

శానిటేషన్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శానిటేషన్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చంపక్‌హిల్స్‌లో గల ఎంసీహెచ్, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ గత 6 నెలలుగా జీతాలు లేక సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. సిబ్బందికి ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రేష్మ, రాందయాకర్, రఘు, గోపాల్, సంపత్, భారతి, కళ్యాణి, రజిత తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిలుపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ వై.రాధాకిషన్ అన్నారు. బుధవారం మండలంలోని మల్కాపూర్ పశువైద్యశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డెయిరీలను సందర్శించి పాడి రైతులకు పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా డీవీహెచ్‌వో రాధాకిషన్ మాట్లాడుతూ సీజనల్‌గా సంక్రమించే వ్యాధుల పట్ల గొల్లకురుమలు, పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోగాలు సోకినట్లు గుర్తిస్తే తక్షణమే సమీపంలో ఉన్న పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ నర్సయ్య, మండల పశువైద్యాధికారి అనేశ్, సిబ్బంది భిక్షపతి, ఫయాజ్, రమేష్, జమాల్, నాగరాజు, పాడి రైతులు రంజిత్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని నిరసన

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా బకాయి పడిన కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ విద్యార్థి సంఘాలు, ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యం బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిరసన చేపట్టారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు, స్థానిక విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో కళాశాల నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి, ఆర్డీవో ఆఫీసులో వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా విద్యాజ్యోతి కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్ కిరణ్ మాట్లాడారు. బకాయిలు విడుదల చేయాలని గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుతానికి పలుమార్లు విజ్ఞప్తి చేస్తున్నా జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి వెంటనే ఫీజులు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాల శౌరయ్య, రాయపరెడ్డి, మధుబాబు, విద్యాసాగర్, హైమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

జఫర్‌గడ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలానికి కేటాయించబడిన కొత్త ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. 2024 డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో పాఠశాలలను కేటాయిస్తూ జిల్లా విద్యాధికారులు ఉత్తర్వులు అందజేశారు. జఫర్‌గడ్ మండలానికి 9 మంది ఉపాధ్యాయులను కేటాయించారు.

- లింగాలఘణపురం: మండలానికి కేటాయించబడిన 8మంది కొత్త ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. ఈ మేరకు ఎంఈవో పడాల విష్ణుమూర్తి తెలిపారు.
- పాలకుర్తి: మండలంలోని ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. మండలానికి 12 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం కేటాయించింది.

రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు

▸▸ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్


గోవర్ధనగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది కొనుగోళ్లు నిర్వహించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని శివునిపల్లి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ రోజు కొనుగోళ్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సెంటర్‌లకు వచ్చే రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. మాయిచ్చర్ వచ్చిన ధాన్యం గుర్తించి వెంటనే ఏఈవోలు టోకెన్‌లు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, డీసీఎస్‌వో సరస్వతి, డీఆర్డీవో వసంత, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, ఆర్ఐ రవీందర్, ఏవో చంద్రన్‌కుమార్, ఏపీఎం కుమార్, ఏఈవో ఈశ్వరి, ఈవో తిరునగరి శ్రీకాంత్, మార్కెట్ వైస్‌చైర్మన్ నూకల ఐలయ్య, నాయకులు బూర్ల శంకర్, కొంతం శ్రీనివాస్, గుర్రంరాజు, నీల రాములు, చిగురు సరిత పాల్గొన్నారు.

- రఘునాథపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో ఐకేపీ ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం మండలంలో 22 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ2320, కామన్ గ్రేడ్ క్వింటాకు రూ.2320గా ధర నిర్ణయించిందని, సన్న వడ్లకు క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ ప్రకటించిందని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, సివిల్ సప్లయి డీఎం హతిరాం, డీసీఎస్‌వో సరస్వతి, డీపీఎం రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ మోహ్సిన్ ముజ్తబ, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీఎం సారయ్య, ఏవో శ్రీనివాస రెడ్డి, కవిత, సీసీలు రేనావతి, సంపత్, భాగ్య, ఉమ, నిర్వాహక కమిటీ సభ్యులు రాధిక, పూల, హైమవతి, భాగ్య, రమ, వెంకటస్వామి, రాజమౌళి, యాదలక్ష్మి, ఏఈవో వినోద్ పాల్గొన్నారు.
- జనగామ రూరల్: జనగామ మండలంలోని గానుగుపహడ్, పెంబర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరిధాన్యానికి గిట్టుబాటు ధర, సన్న వరి ధాన్యంకు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మతి మహేందర్‌రెడ్డి, చిర్ర శ్రీనివాస్‌రెడ్డి, లింగాలనర్సిరెడ్డి, అంబాల ఆంజనేయులు, బండారు సిద్దులు, శీలం కొండల్ రెడ్డి, బన్సీ నాయక్, ముక్కెర రాజయ్య పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడి మృతి

లింగాలఘణపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాణిక్యాపురంకు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు ముమ్మాడి రామబ్రహ్మం(56) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. రామబ్రహ్మం తెలంగాణ మలిదశ పోరాట సమయంలో అనేక ఆందోళనలు చేసి ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచాడు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగిన రామబ్రహ్మం భార్య లలితను స్థానికులు సర్పంచ్‌గా ఎన్నుకుని ఉద్యమానికి ఊపందించారు. అందరితో కలివిడిగా ఉండే రామబ్రహ్మం మృతి పట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గౌస్ పాషాకు నివాళి

కొడకండ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎండీ.గౌస్ పాషా (48) 20 సంవత్సరాలుగా హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ప్రస్తుతం ఆయన కొడకండ్ల పోలీ‌స్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భౌతికకాయానికి పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొడకండ్ల ఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయనకు భార్య కుమారుడు, ఇద్దర కుమార్తెలు ఉన్నారు. అలాగే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు.

వైభవంగా దుర్గామాత బోనాలు

▸▸ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విజయ దుర్గామాతా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈనెల 14 నుంచి ప్రారంభమైన ఉత్సవాలలో భాగంగా 15న ఎల్లమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించగా బుధవారం విజయ దుర్గామాతకు పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. తొలుత పట్టణంలోని బొడ్రాయి నుంచి ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో పెద్దమనిషి బోనం, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘటం కుండను శోభాయాత్రగా తీసుకువచ్చారు. అనంతరం పొట్టేళ్లతో కట్టిన పళ్లెరం బండిని డప్పు చప్పుళ్ల మధ్య ర్యాలీగా తీసుకువచ్చారు. అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం బతుకమ్మ కుంటలోని విజయదుర్గామాత దేవాలయంలో దుర్గామాత కల్యాణం ఘనంగా నిర్వహించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు దుర్గామాత ఉత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి నిరోధకుడు శ్రీహరి

▸▸ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

▸▸ కడియంను ఓడగొట్టడానికి ఇందిరక్క సైన్యం సిద్ధంగా ఉంది


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి నిరోధకుడు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు. నిజాయితీపరుడిని అని చెప్పుకునే శ్రీహరికి రాజ్యాంగంపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వస్తే చిత్తుగా ఓడగొట్టడానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరక్క సైన్యం సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 ఏళ్ల కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి జరుగలేదని కడియం మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఘన్‌పూర్ మున్సిపాలిటీగా ప్రకటన వచ్చే సమయంలో రాకుండా, 100 పడకల ఆస్పత్రి రాకుండా అడ్డుపడిన అభివృద్ధి నిరోధకుడు కడియం అన్నారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీలు మారపాక రవి, చాడ సరిత, నాయకులు పసునూరి మహేందర్ రెడ్డి, ఆకుల కుమార్, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, కర్ర సోమిరెడ్డి, చల్లా చందర్‌రెడ్డి, తాటికొండ సురేష్, కనకం గణేష్, పెంతల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లేవీ?

(5వ పేజీ తరువాయి)

భాగంగా గత ఏడాది పత్తి ధర క్వింటాలుకు మధ్యరకం రూ.6,620, పొడవు రకం రూ.7,020 ఉండగా ఈ ఏడాదికి గాను మధ్యరకం రూ.7,121, పొడవు రకం రూ.7,521కి పెంచిం ది. కానీ.. పెంచిన ధరలను మిల్లుల యజమానులు ఎక్కడా పాటించిన దాఖలాలు కనిపించడం లేదు. మి ల్లుల యజమానులు రైతుల పత్తిని క్వింటాకు రూ.6,500 కంటే ఎక్కువగా కొనడం లేదని 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో తేలింది. తేమ శాతం ఎక్కువగా ఉందని, పత్తి నల్లబారిపోయిందంటూ కొర్రీలు పెడుతూ తక్కువ ధరకు కొంటున్నారని రైతులు వాపోతున్నారు. మరీ తక్కువ ధర చెబుతుండడంతో ఇష్టం లేని రైతులు పత్తిని తక్కువ ధరకు అమ్మకోలేక తిరిగి ఇళ్లకు తీసుకుపోతున్నారు. ఇంట్లో నిల్వ చేయలేక, అమ్ముకుందామంటే ధర రాక నానా అవస్థలు పడుతున్నామంటూ రైతులు వాపోతున్నారు.

అడ్డికి పావుశేరు ధరకు అడిగారు

- బల్ల రాజు, పత్తి రైతు, మోటకొండూరు గ్రామం, యాదాద్రి భువనగిరి జిల్లా



పత్తిని మా దగ్గర తక్కువ ధరకు అడగడంతో సీసీఐ సెంటర్‌లో అమ్ముకుందామని జనగామకు వచ్చాం. ఇక్కడ సీసీఐ సెంటర్ తెరవకపోవడంతో పత్తి మిల్లులకు వెళ్లాం. అక్కడ పత్తిని చూసి క్వింటాకు రూ.5,500 మాత్రమే ఇస్తామని అంతకంటే ఎక్కువ ఇవ్వబోమని చెప్పారు. దీంతో ఏమీ చేయలేక తిరిగి ఇంటికి వెళ్లేందుకు నిర్ణయించుకున్నాం. 30 కి.మీ నుంచి వచ్చాం. అరకొర ధరకు అమ్ముకుంటూ పెట్టుబడి కూడా వచ్చేలా లేవు. ఏ మిల్లుకు వెళ్లినా ఒకటే ధర చెబుతున్నారు. చూస్తుంటే అందరూ సిండికేట్ అయినట్లుగా తెలుస్తోంది. సీసీఐ సెంటర్లు పెడితే రైతులకు మేలు జరుగుతుంది.

18 నుంచి సీసీఐ కేంద్రాలు ప్రారంభిస్తాం

- రోహిత్‌సింగ్, అదనపు కలెక్టర్(రోహిత్ సింగ్)



జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఆధ్వర్యంలో 15 పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని భావించి ఉన్నతాధికారులకు ప్రపోజల్ పంపించాం. ఇందులో 10 సెంటర్ల ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. వీటిని శుక్రవారం నుంచి ప్రారంభించాలని నిర్ణయించాం. ఇందుకు సంబంధించి సీసీఐ అధికారులు, మార్కెటింగ్ అధికారులు, అన్ని పత్తి మిల్లుల యజమానులతో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశాం. సీసీఐ కేంద్రాల్లోనే రైతుకు కనీస మద్దతు ధర అందుతుంది. రైతులు ప్రైవేటు ట్రేడర్లను ఆశ్రయించి మోసపోకుండా సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్ముకొని కనీస మద్దతు ధరను పొందాలి.

జెండా మోసిన వారికి స్థానం కల్పించాలి

జఫర్‌గడ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ జెండా మోసిన నాయకులు, కార్యకర్తలకే ఇందిరమ్మ కమిటీల్లో స్థానం కల్పించాలని కాంగ్రెస్ నేత, మాజీ జడ్పీటీసీ పట్టపురి సదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం జఫర్‌గడ్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో భాగంగా మండలంలో మొదటి నుంచి పార్టీలో పనిచేసిన వారికి కాకుండా.. కొత్తగా పార్టీలో చేరిన నాయకులకు స్థానం కల్పిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామాల్లో అహర్నిశలు కష్టపడి, కేసుల పాలై పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేసిన కాంగ్రెస్ నాయకులను అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సమావేశంలో కాంగ్రెస్ మండల నాయకులు రడపాక రాజ్‌కుమార్, టి.రాజేందర్, ముక్తార్, ఉల్లి శివరాజు, నంచర్ల యాదగిరి, మర్రి రమేశ్, బానోత్ లచ్చిరాం, డానియేలు, కైరిక మల్లయ్య, బానోత్ భిక్షపతి, నీలం రమేశ్‌పాల్గొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా యాదగిరి

లింగాలఘణపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లుట్ల గ్రామ గౌడ సంఘం అధ్యక్షులుగా అంబాల యాదగిరిగౌడ్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మొగులగాని శ్రీను, కార్యదర్శిగా గుర్రం వెంకటేశ్, కార్యవర్గ సభ్యులుగా అంబాల సత్యనారాయణ, గణగణ సత్యనారాయణ, కుర్రెముల శ్రీను, కొయ్యడ చంద్రం, శాగంటి రవి, కొయ్యడ కిరణ్, రాజు, సలహా దారులుగా బెల్లంకొండ సోమనాథం, బత్తిని భిక్షపతి, కొయ్యడ చంద్రయ్య, కొయ్యడ చిన్న సోమయ్య, కుర్రెముల చక్రపాణి, కొయ్యడ రామలింగంలు ఎన్నికయ్యారు.

ఉన్నత ప్రమాణాలతో విద్య అందించాలి : డీఈవో

రఘునాథపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించి అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.రాము అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మండల విద్యా వనరుల కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో తరగతుల వారీగా విద్యార్థుల ప్రతిభా పాటవాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రఘునందన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్, బాల్నే నాగభూషణం, ఎంఐఎస్ సమ్మయ్య, సీఆర్‌పీలు శ్రీనివాస్, రమేష్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

- స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : స్టేషన్‌ఘన్‌పూర్ మండల రిసోర్స్ కేంద్రాన్ని డీఈవో కె.రాము బుధవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులు, ఎస్ఏ-1 పరీక్ష పేపర్ల పంపిణీని పరిశీలించారు. నూతనంగా మండలానికి వచ్చిన టీచర్లకు జాయినింగ్ రిపోర్టులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జి.కొమురయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం ఎం.సంపత్, సీఆర్‌పీలు గిరి, లవన్, జ్యోతి, పి.వెంకటేశ్వర్లు, శ్రీలత, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.